క్లుప్తంగా

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



పెనమలూరు: సమాజాభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చోడవరం గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం అన్నారు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శ్రీలత తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామానికి పదోన్నతి పై బదిలీ అవ్వటంతో ఆమెను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. చోడవరంలో మనబడి నాడు–నేడు,తో పాఠశాల అభివృద్ధికి, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దిన హెచ్ఎం శ్రీలత సేవలను అభినందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు, మదర్‌తెరిసా సంస్థ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు, వార్డు సభ్యురాలు నిర్మలకుమారి, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మానుయేల్, ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, అబ్దుల్‌ఖాలీక్, డి.దనేష్, రఘు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



కంకిపాడు: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో బీసీ కాలనీ కాలువ కట్ట రోడ్డును పంచాయతీ నిధులు రూ.15 లక్షలు అంచనా వ్యయంతో సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు గురువారం చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులను ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతక్రమంలో వసతులు కల్పించేందుకు పాలకవర్గం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ముసిబోయిన మోహనకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనూష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



కంకిపాడు: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో బూత్‌కమిటీ కన్వీనర్ల నియామక సమావేశం పార్టీ జిల్లా నేత వీరమాచనేని శ్రీనినవాసరావు డెయిరీలో గురువారం నిర్వహించారు. బాకీ బాబు, మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనల మేరకు బూత్ కమిటీలను నియమిస్తున్నామని చెప్పారు. బూత్ కమిటీ బాధ్యులు తమ విధులను సమర్ధంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అందరూ సమన్వయంతో పనిచేస్తేనే విజయం సాధ్యమన్నారు. ఎంపీటీసీ సభ్యులు బూరగ బాలాజీ, షేక్ అమీనా బి, అగ్రిబోర్డు డైరెక్టర్ నకిరికంటి శేఖర్, నాయకులు నాగదేశి బాలకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, కొడవలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ చట్టంపై అవగాహన అవసరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీలునామా, గిఫ్ట్ డీడ్‌లపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ తదనంతరం మాత్రమే పిల్లలకు ఆస్తులు చెందేటట్లు ఏర్పాట్లు చేయాలని, ముందుగానే ఆస్తుల్ని ఇవ్వడం వలన ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. ఆస్తులు రాయించుకుని తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటివేసిన ఘటనలు చూస్తున్నామని చెప్పారు. ముందుగానే ఆస్తులు రాయించుకుని ఇబ్బందులకు గురిచేస్తే వీలునామా రద్దు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో వేమూరు బాబూరావు, పూడి శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.రాము, సంఘం సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతి, ఎస్.బాలాజీ, సైకాలజిస్ట్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

పెనమలూరు: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తున్నామని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. యనమలకుదురు గ్రామంలో గురువారం సచివాలయం 3లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. సురక్ష శిబిరాలు అందరూ ఉయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 1237 సర్టిఫికెట్లు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికి సేవలు మరింతగా చేరువయ్యాయని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు సచివాలయం–3లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 600 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి, జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

పి.నైనవరం(విజయవాడరూరల్):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. గురువారం పి.నైనవరం గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం జరిగింది. పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బట్టా సోమయ్య, ఉపసర్పంచి చేకూరి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో కమిషనర్ ప్రకాశరావు

అర్హులందరికీ లబ్ధి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందించటం ద్వారా నూటికి నూరు శాతం లబ్ధి చేకూర్చాలనే చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం కాకులపాడులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 423 కుల ధ్రువీకరణ పత్రాలు, 362 ఇన్‌కం సర్టిఫికెట్లు, 44 కొత్త రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కాకులపాడులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, సర్పంచ్ వరి శ్రీదేవి

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, విజయ స్టీల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొనకళ్ల వాసుదేవ సూర్యశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవానీపురం ఐరన్ కాంప్లెక్స్ సొసైటీ భవనంలో నిర్వహించే శిబిరంలో మానస హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని జీర్ణకోశ(గ్యాస్ట్రో), మానసిక సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్కే అయోధ్య, డాక్టర్ మానస కాజ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సూరే పవన్‌కుమార్‌లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేస్తారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి సమగ్ర ఓటర్ల సర్వే

గన్నవరం: నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సమగ్ర ఓటరు సర్వే నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బీ. చంద్రలీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటరుగా చేర్పడంతో పాటు 2024 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండనున్న వారికి కూడా ఓటుహక్కు కల్పిస్తామన్నారు. ఓటర్ జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించనున్నట్లు తెలిపారు. వందేళ్ల వయస్సు పైబడిన వారిని గుర్తించడం, డోర్ నంబర్లు లేకుండా ఉన్న, ఒకే డోర్ నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్న పరిశీలిస్తామన్నారు. సర్వీస్ ఓటర్లు(మిలటరీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను సరిచేయడం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభిష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కుని అక్కడ జాబితాలో ఉంచుతామన్నారు. ఒక బూత్‌లో సరాసరి 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్‌కు సిఫార్సు చేయడం, పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డులు మార్పులు, చేర్పులు, తప్పులు సరిచేస్తామన్నారు. స్పష్టత లేని ఫొటోలు తొలగించి మంచి ఫొటోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తెంపల్లిలో పారిశుద్ధ్య పనులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులను సర్పంచ్ కొలుసు శిరీషా పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్న పరిస్థితులలో గ్రామంలోని మురుగు నీటి పారుదల, డ్రైనేజీల పూడికతీత పనులు సిబ్బంది చేయించారు. గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా కచ్చా డ్రైన్‌లు తవ్వించారు. పంచాయితీ కార్యదర్శి జేవి నామేశ్వరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చర్యలు..

గన్నవరం రూరల్: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను దూరం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా పర్యటించి ఇళ్లల్లో, బహిరంగ ప్రదేశాల్లో నీటి నిల్వలు గుర్తించాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు అధికారులతో సమన్వయం చేసుకుని నీటి నిల్వలు తొలగించటం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది నీటి నిల్వలు తొలగించారు.



తెంపల్లిలో మురుగు పూడికతీత నిర్వహిస్తున్న పంచాయితీ సిబ్బంది

వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

కంకిపాడు: వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ గీతాబాయి స్పష్టం చేశారు. మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించి వైద్య సేవలపై సిబ్బందితో సమీక్షించారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో తీసుకుంటున్న చర్యలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ వైద్య సేవలు సమర్ధంగా అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆరోగ్య కేంద్రంలో 65 రకాల వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పలూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

నిధుల మంజూరుపై హర్షం

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం నుంచి గోపవరపుగూడెం గ్రామం మీదుగా కొండపావులూరు వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.75కోట్లు నిధులు మంజూరు చేయటం పట్ల ఆ గ్రామాల సర్పంచ్‌లు గురువారం హర్షం వ్యక్తం చేశారు. చిక్కవరం, గోపవరపుగూడెం, కొండపావులూరు సర్పంచ్‌లు అన్నే లక్ష్మణరావు, నల్లూరు వెంకటేశ్వరరావు, ఉప్పుగంటి పద్మజలు మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణానికి నిధులు అందజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రధాన గ్రామాలను కలుపుతూ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఈ రోడ్డు నిర్మాణంతో ఈ గ్రామాలకే కాక పురుషోత్తపట్నం, ముస్తాబాద నుంచి విజయవాడ వెళ్లేందుకు, పరిసర గ్రామాలైన కొత్తగూడెం, వీరపనేనిగూడెం, గొల్లనపల్లి, బీబీగూడెం గ్రామాల ప్రజలకు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ప్రధానంగా రైతాంగం ఎంతగానో లబ్ధిపొందుతుందని చెప్పారు. ఈ రహదారి వెంట ఉన్న వందలాది ఎకరాలు మిర్చి, టమాట, పత్తి, వరి పొలాలు ఉన్నాయన్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు–2, కంకిపాడు–2 సచివాలయంలో ఈ నెల 21న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయ్‌బాస్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈడుపుగల్లు–2 సచివాలయం, 10 గంటలకు కంకిపాడు సచివాలయంలో జగనన్న సురక్ష సభలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో గుర్తించిన సమస్యలపై 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, సేవలను లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ప్రజలు సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

44 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి వెలుగుతో వృద్ధుల కళ్లకు భద్రత లభిస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. కంకిపాడు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 44 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్ల కోసం సిఫారసు చేశారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే దృష్టి లోపాలను గుర్తించి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

సమర్ధంగా ఓటర్ల జాబితా పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలనను సమర్ధంగా నిర్వహించాలని పోలింగ్ బూత్ ఆఫీసర్లకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.చంద్రలీల ఆదేశించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాయలం మీటింగ్ హాల్‌లో పోలింగ్ బూత్ ఆఫీసర్లకు గురువారం శిక్షణ సమావేశం నిర్వహించారు. దీనికి విచ్చేసిన ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.చంద్రలీల మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను జాబితాలో క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు నెలరోజుల పాటు ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఒక కుటుంబంలోని సభ్యుల ఓట్లు అన్ని ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేట్లుగా సరిచూడాలని ఆదేశించారు. ప్రతి ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్, ఫోన్ నంబర్ లింకు ఉందా లేదో పరిశీలించాలని చెప్పారు. అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చెప్పాలన్నారు. అసిస్టెంట్ ఈఆర్‌వో గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చంద్రలీల

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుణదల(విజయవాడతూర్పు): మాదక ద్రవ్యాల వినియోగం వలన జీవితాలు పతనమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.తేజోవతి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆంధ్రలయోల కళాశాల ఆవరణలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగంతో శారీరక రోగాలతో పాటు మానసిక రుగ్మతలు తలెత్తుతున్నాయన్నారు. విద్యార్థులు కేవలం ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. చెడు స్నేహాలు, ఉద్దేశ పూర్వకంగా చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుర్భర పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ అన్నామణి, మానసిక వైద్య నిపుణులు పి.భవాని, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్‌కుమార్, డీన్ డాక్టర్ సుభ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పామర్తినగర్, రైస్‌మిల్ బజారు, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, శ్రీమల్లికార్జున స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి. హరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని సిండికేట్ బ్యాంక్ కాలనీ, రాజుల బజార్, కొట్టివారి వీధి, మల్లే మూడివారి వీధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కడప జిల్లా కడప నగరంలో యూటీఎఫ్ భవనంలో ఈనెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో గురువారం శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందని, ఫెలోషిప్‌లకు కోత విధించిందని విమర్శించారు. విద్యారంగ సమస్యలు, విధానాలపై శిక్షణ తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వైష్ణవ్, దుర్గాప్రసాద్, వేణు, ఉదయ్, విక్రమ్ పాల్గొన్నారు.

భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనది

ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ దేవానందరెడ్డి

విజయవాడకల్చరల్: భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనదని ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, శ్రీ గోళ్ల నారాయణమూర్తి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జంధ్యాల పరదేశిబాబు రచించిన తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథ పరిచయ సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవానందరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ వివాహ వ్యవస్థలో అనేక మధుమైన ఘట్టాలుంటాయని వాటికి శాస్త్రీయతతో పాటు సమాజానికి సందేశం ఇచ్చే అంశాలతో నిండి ఉంటుందన్నారు. నేడు వివాహ వ్యవస్థలో అనేక మార్పులు చేసుకుంటున్నాయని, చాలా సందర్భాల్లో కేవలం మొక్కుబడిగా సాగుతున్నాయని చెప్పారు. నేటి యవతరానికి వివాహ సంప్రదాయాలను తెలియజెప్పాల్సిన అవసరముందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో గ్రంథాలు రచించారని తెలిపారు. తెలుగు సాహిత్యంపై పుస్తకాలు విస్తృతంగా రావాల్సిన అవసరముందన్నారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. పరదేశిబాబు సుదీర్ఘ కాలంగా సాహితీ రంగంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథాన్ని ఇంటర్ ఆపై తరగతులకు పాఠ్యాంశాలుగా చేయాలని సూచించారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, విశ్రాంత ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందం, ఉపాధ్యాయుల సంఘం నాయకుడు డాక్టర్ డి.శ్రీను, పరదేశిబాబు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కావూరి సత్యవతి తెలుగు సాహిత్యంలో కల్యాణాల గ్రంథ విశేషాలను వివరించారు.

సీఎంఏ విజయవాడ చాప్టర్ ప్రారంభం



పటమట(విజయవాడ తూర్పు): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు. పటమటలోని కరణంగారి బజారులో నూతనంగా నిర్మాణమైన ఈ భవనాన్ని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ విజేందర్ శర్మ ప్రారంభించారు. అంతకుముందు విజయవాడ చాప్టర్ చైర్మన్ సీతారామస్వామి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విజయవాడ చాప్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రేఖశర్మ, శంకర్‌పాణికర్, పద్మనాభన్, సుంకర పాపారావు, వినయ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.